క్లుప్తంగా

హైవేపై విరిగిన చెట్ల కొమ్మలు



హైవేపై హనుమంతవాక వద్ద చెట్టు కొమ్మలను తొలగిస్తున్న శానిటరీ సిబ్బంది

ఆరిలోవ: జాతీయ రహదారిపై హనుమంతవాక, వెంకోజిపాలెం మధ్యలో సోమవారం వేకువజామున కురిసిన గాలి వర్షానికి పలు చోట్లు చెట్ల కొమ్మలు విరిగిపోయాయి. ఇవి రహదారిపై పడటంతో వాహనాల రాకపోకలకు ఆటంకంగా మారాయి. స్థానికులు జీవీఎంసీ జోన్–2 అధికారులకు సమాచారమివ్వడంతో వెంటనే స్పందించారు. 9వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది, సచివాలయం సిబ్బంది ఉదయం అక్కడికి చేరుకుని రోడ్డుపై వాహనాలకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు. వాహన రాకపోకలకు ఆటంకం లేకుండా శుభ్రం చేశారు.

మానసిక రోగుల చికిత్స కేంద్రం సందర్శన



కేంద్రంలో పరిశీలిస్తున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు

బీచ్‌రోడ్డు: చినవాల్తేరులోని మానసిక రోగుల చికిత్స కేంద్రాన్ని సోమవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు సందర్శించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు అనుమతితో ఆయన కేంద్రంలోని వార్డులను పరిశీలించారు. మానసిక రోగుల స్థితి, వారికి అందుతున్న సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. వంటగదిని పరిశీలించి, ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. విభాగాధిపతి డాక్టర్ విజయలక్ష్మి, పారా లీగల్ వలంటీర్ ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

వన్ స్టాప్ సెంటర్ సందర్శన

మహారాణిపేట: కేజీహెచ్‌లోని వన్ స్టాప్ సెంటర్‌ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు సందర్శించారు. బాధితులకు అందుతున్న సౌకర్యాలు, కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది మరింత మెరుగ్గా పనిచేయాలని సూచించారు. లీగల్ వలంటీర్ ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

టైప్ రైటింగ్ పరీక్షలు ఆగస్టులోనే నిర్వహించాలి

తగరపువలస: రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ప్రతి ఆరు నెలలకు నిర్వహించే టైప్ రైటింగ్ పరీక్షలను ఏటా మాదిరిగా ఆగస్టులోనే నిర్వహించాలని రాష్ట్ర టైప్‌రైటింగ్ అండ్ షార్ట్ హ్యాండ్ ఇన్‌స్టిట్యూట్ అసోసియేషన్ సభ్యుడు బల్లా వెంకటరావు కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ జూలైలో పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. ఈ ఏడాది మార్చిలో పాస్ అయిన విద్యార్థుల జాబితాలు ఇంకా సంస్థలకు చేరలేదన్నారు. తక్కువ వ్యవధి కారణంగా విద్యార్థుల సంఖ్య ఆశించినంతగా లేదన్నారు.

రంజింపజేసిన సినీ సంగీత విభావరి



సినీ గీతం పాడుతున్న గాయకుడు

సీతంపేట: ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవాల్లో భాగంగా స్వరాంజలి, స్వరార్చన కళా సంస్థల ఆధ్వర్యంలో సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. సంస్థ గాయనీ గాయకులు అంబిక, కల్యాణి, రంజిత, సుజాత, ఎం.కృష్ణంరాజు, భూమతిరావు, నరసింగరావు తదితరులు ఎన్టీఆర్ నటించిన చిత్రాల్లోని పాటలు పాడి ప్రేక్షకులను రంజింపజేశారు.

కళాకారులకు బిల్లులు చెల్లించాలని ధర్నా

జగదాంబ: పోర్టు అథారిటీ పరిధిలోని గోడలపై వేసిన కళ రూపాల (బొమ్మలు)కు బిల్లులు వెంటనే చెల్లించాలని కోరుతూ సోమవారం పోర్టు ముఖద్వారం ఎదురుగా సీఐటీయూ నాయకుడు వై.రాజు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ఈ పనుల్లో అనేక మంది చిత్రకారులు కష్టపడ్డారన్నారు. ఐదు నెలలు కావస్తున్నా ఇప్పటికీ పోర్టు అధికారులు డబ్బులు చెల్లించలేదన్నారు.

కళా ప్రాంగణాలకు ఆదరణ కరవు

- పర్యాటక ప్రాంతాల్లో వెలవెలబోతున్న మైదానాలు, వేదికలు
- సాగర తీరంలో అరకొరగా కార్యక్రమాల నిర్వహణ
- ప్రచారం అంతంత మాత్రమే
- ఆదాయం పెంపు, మౌలిక వసతులపై దృష్టి సారించని అధికారులు



బీచ్ రోడ్డులోని సబ్‌మెరైన్ వద్ద ఉన్న కళా ప్రాంగణం



వీఎంఆర్‌డీఏ స్మార్ట్ సిటీ పార్క్‌లోని కళా వేదిక, మైదానం,



సబ్‌మెరైన్ మ్యూజియం వద్ద ఆహ్లాదకరమైన సీటింగ్ ఏరియా



వీఎంఆర్‌డీఏ పార్క్ వద్ద ఏర్పాటు చేసిన మైదానాల(లాన్స్) బోర్డులు

ఏయూక్యాంపస్: వీఎంఆర్‌డీఏ పరిధిలోని పర్యాటక ప్రాంతాల్లో గల కళా ప్రాంగణాలకు తగిన ఆదరణ లభించడం లేదు. దీంతో సాగర తీరంలో ఆహ్లాదకర వాతావరణంలో ఉన్న ఈ వేదికలు నిరుపయోగంగా మారిపోతున్నాయి. బర్త్‌డేలు, వివాహ వార్షికోత్సవాలు, కుటుంబ వేడుకలు జరుపుకోవడానికి ఎంతో అనువుగా ఈ ప్రాంగణాలు నిలుస్తాయి. నగరం మధ్యలో ఆహ్లాదకరమైన సముద్ర తీరంలో, పచ్చని ప్రకృతి నడుమ ఉన్న ఈ వేదికల్లో జరిగే కార్యక్రమాలు కేవలం వేళ్ల మీద లెక్కపెట్టవచ్చు. తగిన ప్రచారం, ప్రాచుర్యం లేకపోవడంతో వీటికి ఆదరణ కరవైంది.

అందమైన వేదికలు

బీచ్ రోడ్డులోని వీఎంఆర్‌డీఏ స్మార్ట్ సిటీ పార్క్‌లో మొత్తం మూడు లాన్‌లు ఉన్నాయి. లాన్–2, లాన్–3ల్లో 1,000 నుంచి 1,500 మంది వరకు కూర్చునే అవకాశం ఉంది. వీటికి చేరువలో లాన్–1(ఎంజీఎం గ్రౌండ్) ఉంది. దీనిలో దాదాపు 2,500 నుంచి 3,000 మంది వరకు కూర్చోవచ్చు. ఇవన్నీ సముద్ర తీరం కనిపించేలా పచ్చని మైదానాల్లో ఏర్పాటు చేసినవి. ఇక్కడున్న లాన్–1కు అద్దె రూపంలో రోజుకు రూ.50 వేలు, లాన్–2, 3లకు అద్దె రూపంలో రోజుకు రూ.25 వేలు చెల్లించాలి. వీటితోపాటు కురుసుర సబ్‌మెరైన్ మ్యూజియం పక్కనే మరో మైదానం, దానిలో అందమైన వేదిక అందుబాటులో ఉంది. దీనికి రోజుకు రూ.15 వేల నుంచి అద్దె వసూలు చేస్తున్నారు. కార్యక్రమానికి అనుగుణంగా ఈ అద్దెను నిర్ణయిస్తున్నారు. వీటితో పాటు సెంట్రల్ పార్క్, కైలాసగిరిపైన కూడా ఇటువంటి వేదికలు ఉన్నాయి. వీటికి కూడా ఆదరణ అంతంత మాత్రంగానే ఉంది.

మౌలిక వసతులు అవసరం

వేదికల వద్ద కొద్దిపాటి మౌలిక వసతులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం కొన్ని వేదికలు దెబ్బతిన్నాయి. వీఎంఆర్‌డీఏ స్మార్ట్ సిటీ పార్క్‌లోని వేదికలపై ఉన్న టైల్స్ ఊడిపోవడం, మెట్లు దెబ్బతినడం జరిగాయి. వీటికి మరమ్మతులు చేసి, వేదికపై పైకప్పు నిర్మిస్తే మరింత సౌలభ్యంగా ఉంటుంది. వేదిక వద్ద అవసరమైన కుర్చీలు వంటి సదుపాయాలను బయట నుంచి అద్దెకు తీసుకురావాల్సిన అవసరం ఏర్పడుతోంది. దీంతో కార్యక్రమ నిర్వాహకులకు అద్దె కన్నా వీటి భారం పెరుగుతోంది. దీనికి పరిష్కారం చూపుతూ అద్దె కొంత తగ్గిస్తే వినియోగం పెరిగే అవకాశం ఉంది.

అద్దె అందుబాటులో ఉండాలి

గతేడాది కాలంలో పట్టుమని పది కార్యక్రమాలు కూడా బీచ్ రోడ్డులోని వేదికల్లో జరిగిన దాఖలాలు లేవు. అద్దె అందరికీ అందుబాటులో ఉంచితే కార్యక్రమాల సంఖ్య పెరిగి ఆదాయం రెట్టింపయ్యే అవకాశముంది. ఈ దిశగా అధికారులు పునరాలోచించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ఉన్న అద్దెలో సాంస్కృతిక, కళా కార్యక్రమాలకు 50 శాతం వరకు రాయితీ కల్పిస్తే బాగుంటుందని కళాభిమానులు సూచిస్తున్నారు. పర్యాటక ప్రాంతాల్లోని కళా ప్రాంగణాలను తీర్చిదిద్ది, జనంతో కళకళలాడేలా చర్యలు చేపట్టాలని పలువురు నగరవాసులు కోరుతున్నారు.

సమాచార బోర్డుల ఏర్పాటు

ఆదాయ వనరులుగా నిలిచే లాన్‌లను అద్దెకు ఇవ్వడంపై గతంలో 'సాక్షి' కథనం ప్రచురించింది. వీటిని పూర్తిస్థాయిలో అందుబాటులో తీసుకురావడం, ఆదాయ వనరులు పెంచుకోవాల్సిన అవసరాన్ని వివరించింది. దీనిపై స్పందించిన వీఎంఆర్‌డీఏ అధికారులు పార్క్‌ల వద్ద ప్రత్యేకమైన సమాచారంతో కూడిన బోర్డులు ఏర్పాటు చేశారు. దీనిపై ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్‌ను సైతం ఇచ్చారు. ఈ కోడ్ మాత్రం పనిచేయడం లేదు. ప్రత్యేకంగా ఇచ్చిన ఫోన్ నంబర్లకు ఫోన్ చేస్తే వివరాలు చెబుతున్నారు. ఏవైనా కార్యక్రమాలు నిర్వహించాలంటే సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో మనకు కావాల్సిన వేదికకు సంబంధించిన అద్దె చెల్లించి అనుమతి పొందాల్సి ఉంటుంది.



బీచ్ రోడ్డులో గతంలో నిర్వహించిన హోలీ వేడుకల సందడి(ఫైల్)

ఆలోచింపజేసిన ఎయిడ్స్‌పై నృత్య రూపకం



బీచ్ రోడ్డులో సబ్‌మెరైన్ వద్ద జానపద నృత్య రూపకం ప్రదర్శిస్తున్న కళాకారులు

ఏయూక్యాంపస్: ఎయిడ్స్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ జానపద నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. బీచ్ రోడ్డులోని సబ్‌మెరైన్ మ్యూజియం ఎదురుగా సమిధ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. విశాఖ కళారత్న కళాపరిషత్ బృందం ప్రజలను ఆలోచింపజేసేలా హెచ్‌ఐవీ–ఎయిడ్స్‌పై కళా రూపకాన్ని ప్రదర్శించింది. హెచ్‌ఐవీ వ్యాప్తి చెందడానికి అవకాశమున్న అంశాలను వివరించారు. జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో మురికివాడలు, జనసమ్మర్థం ఉండే ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో సమిధ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు డి.వీరభద్రరావు, ఎన్.వి.వి.ప్రసాద్ రెడ్డి, కళాకారులు వై.కె రాజు, ధనలక్ష్మి, దప్పు బాలు, ఓలేటి శంకర్, ఈశ్వర రావు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఏయూ డిగ్రీ ఫలితాల్లో సత్తా చాటిన విద్యార్థులు



ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు

దాబాగార్డెన్స్: ఏయూ డిగ్రీ ఫలితాల్లో ఆదిత్య కళాశాల విద్యార్థులు విజయ దుందుభి మోగించారు. ప్రకటించిన డిగ్రీ కోర్సు వివిధ విభాగాల్లో 1, 2, 3 ర్యాంక్‌లతో పాటు మొత్తం 12 ర్యాంకులు ఆదిత్య కైవసం చేసుకున్నారని చైర్మన్ డాక్టర్ ఎన్. శేషారెడ్డి తెలిపారు. బీసీఏ విభాగం నుంచి దున్నా ధనలక్ష్మి మొదటి ర్యాంకు, అమ్‌జూర్ పావని సెకండ్ ర్యాంక్, పెన్మత్స క్యాతిశ్రీ సెకండ్ ర్యాంకు, బొడుపు శిరీష థర్డ్ ర్యాంకు, గంగు రిపిక థర్డ్‌ర్యాంక్ (మొదటి మూడు ర్యాంకులు) ఆదిత్య విద్యార్థులు కైవసం చేసుకోగా, బీబీఏ విభాగం నుంచి కొరిపోలు మహిత సెకండ్ ర్యాంకు, వానపల్లి మౌనిక థర్డ్ ర్యాంకు, గుండ్రు వెంకటసాయి కీర్తి థర్డ్‌ర్యాంకు సాధించగా, బీఎస్సీ విభాగం నుంచి మండల యమున ఫస్ట్ ర్యాంక్, సత్తి మోనిక విశాల్ థర్డ్ ర్యాంక్, బీకాం నుంచి పల్లేటి పల్లవి థర్డ్‌ర్యాంకు, ప్రిసింగ్ హరిప్రియ సెకండ్ ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. బీఎస్సీలో 2, బీకాంలో 2 ర్యాంకులు కైవసం చేసుకున్నారు. ఈ మేరకు విద్యార్థులను ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇ.ఎస్.ధనుంజయరావు అభినందించారు.

పోర్టు ఎస్సీ, ఎస్టీ సంఘం నూతన కార్యవర్గం కొలువు



ఉమామహేశ్వరరావు



దేవీశ్వరరావు

దాబాగార్డెన్స్: విశాఖపట్నం పోర్టు అథారిటీ ఎస్సీ, ఎస్టీ అధికారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం జరిగింది. అధ్యక్షుడిగా ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా దేవీశ్వరరావు మరోసారి ఎన్నికయ్యారు. కోశాధికారిగా ఎం.సాల్మన్‌రాజు, ఉపాధ్యక్షులుగా డాక్టర్ టీఎస్ దీప్తి, కె.వేణుగోపాల్, ఈ.వెంకట్రావు, పి.ప్రసన్నకుమార్‌ను, సంయుక్త కార్యదర్శులుగా పి.సుందరేషన్, కె.శ్రీను, సిద్దార్థకుమార్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఎం.ఎస్.రావు, బూరి శ్రీను, సంజీవరావు, కె.వి.రమణతో పాటు పలువురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సీనియర్ సభ్యుడు ఎం.ఎన్.ఎస్.ఎస్. సింగ్ ఆధ్వర్యంలో పోర్టు అసోసియేషన్ కార్యాలయంలో ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో పని చేస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

భద్రతలో భేష్.. ఆర్టీసీ సిబ్బంది



ప్రయాణికుడికి భద్రంగా బ్యాగ్ అప్పగిస్తున్న స్టేషన్ మేనేజర్ రమేష్, హెడ్‌గార్డ్ నారాయణ

దాబాగార్డెన్స్: ఆర్టీసీలో ప్రయాణించండి.. సురక్షితంగా గమ్యాన్ని చేరుకోండి. మీ భద్రత మాదేనన్న ఆర్టీసీ కొటేషన్లకు సిబ్బంది ప్రయాణికుల భద్రత విషయంలో జాగ్రత్తగానే ఉన్నారనడానికి సోమవారం ద్వారకా బస్ స్టేషన్ వద్ద జరిగిన సంఘటనే నిదర్శనం. తూర్పుగోదావరి జిల్లా నారాయణపురం, పెద్దాపురానికి చెందిన ఆర్.శ్రీనివాసరావు అనే ప్రయాణికుడితో పాటు మరో ముగ్గురు పెద్దలు, ముగ్గురు పిల్లలు విశాఖ నుంచి శ్రీకాకుళం వెళ్లేందుకు ద్వారకా బస్ స్టేషన్‌కు సుమారు ఒంటి గంట ప్రాంతంలో చేరుకుని ఏపీ31జెడ్0381 నంబరు గల బస్సు ఎక్కారు. మధురవాడ వద్దకు వెళ్లేసరికి బ్యాగ్ మిస్సయిందని గుర్తించారు. ఈ విషయాన్ని ఆ బస్సు డ్రైవర్ దృష్టికి తీసుకెళ్లారు. డ్రైవర్ ద్వారా బస్ స్టేషన్ మేనేజర్‌కు ఫోన్ చేశారు. స్టేషన్ మేనేజర్ వెంటనే సెక్యూరిటీ సిబ్బందిని పిలిచి ప్రయాణికుడి బ్యాగ్ మిస్సయిందన్న విషయం చెప్పగా.. సెక్యూరిటీ సిబ్బంది వెంటనే బ్యాగ్ ఆచూకీ కనుగొన్నారు. ప్లాట్‌ఫాం నంబరు 2 వద్ద బ్యాగ్‌ను గుర్తించి భద్రపరిచారు. బ్యాగ్ మిస్సయిన ప్రయాణికుడికి ఫోన్ చేసి బ్యాగ్ ఏ రంగులో ఉంది? బ్యాగులో ఏ సామాన్లు ఉన్నాయి? వంటి వివరాలు అడిగి సెక్యూరిటీ హెడ్ గార్డ్ నారాయణ సమక్షంలో ఆ బ్యాగ్‌ను స్టేషన్ మేనేజర్ జీవీ రమేష్ ప్రయాణికుడికి అందజేశారు.

పోషకాహారంతో ఆరోగ్యం

ఏయూక్యాంపస్: పోషకాహారం తీసుకోవడం వల్ల పాలిస్టిక్ ఓవరీ సిండ్రోమ్(పీసీవోఎస్) నుంచి ఉపశమనం పొందవచ్చని హెల్త్‌కేర్ నిపుణురాలు రితికా సమర్థర్ అన్నారు. బీచ్ రోడ్డులో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మహిళల ఆరోగ్యంపై ఆమె మాట్లాడారు. సీపీవోఎస్ కారణంగా జీవనశైలిలో మార్పులు జరుగుతున్నాయన్నారు. ఉదయం తీసుకునే ఆహారంపై మహిళలు శ్రద్ధ వహించాలని సూచించారు. ఆహారంలో బాదంను భాగం చేసుకోవాలన్నారు. బాదం, ఓట్స్ కలిపిన ఆహారం ఆరోగ్యకరమైన కొవ్వు, ప్రొటీన్, ఫైబర్‌ను శరీరానికి అందిస్తాయని చెప్పారు. వీటిని ఆహారంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. ఇటువంటి ఆహారాలు పీసీవోఎస్ నుంచి మహిళలకు ఉపశమనం కలిగిస్తాయన్నారు.

రహదారిలో గుంత పూడ్చివేత



కిర్లంపూడి లే అవుట్‌లోని రహదారి మధ్యలో పూడ్చిన గుంత

ఏయూక్యాంపస్: రహదారి మధ్యలో ఏర్పడిన గుంతను పూడ్చడంతో వాహన చోదకులు ఊపిరి పీల్చుకున్నారు. చినవాల్తేర్ కోటక్ స్కూల్ నుంచి కిర్లంపూడి లే అవుట్‌లోని రహదారి మధ్యలో ఇటీవల గొయ్యి ఏర్పడింది. దీనిని ఎవరూ పట్టించుకోకపోవడంతో స్థానికులు దానిపై చెట్టు కొమ్మను ఉంచారు. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహన చోదకులు గుంతలో పడిపోకుండా తాత్కాలికంగా కొమ్మను అడ్డు పెట్టారు. ఈ సమస్యపై ఇటీవల 'సాక్షి' వార్త ప్రచురించింది. దీనిపై స్పందించి ఈ గుంతను పూడ్చడంతో ఈ మార్గంలో ఎటువంటి ఇబ్బంది లేకుండా వాహనాల రాకపోకలు సాగుతున్నాయి.

యువతి అదృశ్యం

ఎంవీపీకాలనీ: ఓ యువతి అదృశ్యంపై ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలివి.. అక్కయ్యపాలెంలో కుటుంబ సభ్యులతో కలిసి కుసుమ అనే యువతి నివసిస్తోంది. ఈ నెల 22న ఆదర్శనగర్‌లోని స్నేహితుడు మధు వివాహానికి హాజరై తిరిగి ఇంటికి రాలేదు. అప్పటి నుంచి కుసుమ ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు పలు చోట్ల వెతికినా.. ఫలితం లభించలేదు. కుసుమ తండ్రి శ్రీనివాసరావు సోమవారం ఫిర్యాదు చేయడంతో ఎంవీపీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోగులకు మరింతగా సేవ చేయాలి



డాక్టర్ శ్రీహరిని సత్కరిస్తున్న వైఎస్సార్‌టీయూసీ నాయకులు

మహారాణిపేట: ఉద్యోగులకు పూర్తి సహకారం అందిస్తామని కేజీహెచ్ నూతన సీఎస్ఆర్ఎంవో డాక్టర్ శ్రీహరి అన్నారు. సోమవారం ఇక్కడి వైఎస్సార్‌టీయూసీ యూనియన్, కేజీహెచ్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు నీలాపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉద్యోగులు నూతన సీఎస్ఆర్ఎంవోగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ శ్రీహరిని కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగులకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా నూతన సీఎస్ఆర్ఎంవో డాక్టర్ శ్రీహరి మాట్లాడుతూ పేషెంట్లకు మరింతగా సేవ చేయాలని, ఆస్పత్రికి మంచి పేరు తేవాలని అన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నీలాపు శ్రీనివాసరావు, కార్యదర్శి సురుపల్లి రాజారావు, ఉపాధ్యక్షులు వెంకట్రావు, పార్వతి, జాయింట్ క్యాషియర్ బేగం, జయ, హెల్త్ ఇన్స్‌పెక్టర్ ఒ.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాల కార్పొరేషన్ చైర్మన్‌తో సమావేశం



మాల కార్పొరేషన్ చైర్మన్ విజయ్‌కుమార్‌తో జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఉద్యోగులు

ఎంవీపీకాలనీ: జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఉద్యోగులు సోమవారం రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపాటి విజయ్‌కుమార్‌తో సమావేశమయ్యారు. అమరావతిలోని ఆయన కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏపీఓబీఎంఎంఎస్ రుణాలపై చైర్మన్‌తో చర్చించారు. రుణాల మంజూరులో ప్రభుత్వ విధివిధానాలు, లబ్ధిదారుల ఎంపిక, జిల్లాలకు కేటాయిస్తున్న యూనిట్లు ఇలా పలు అంశాలపై చర్చించారు. కార్పొరేషన్ ఉద్యోగి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై నిలిచిన వర్షపు నీరు



వీఎంఆర్‌డీఏ పార్క్ వద్ద వర్షపు నీరు



కిర్లంపూడి లే అవుట్‌లోని రహదారిపై నిలిచిన వాన నీరు

ఏయూక్యాంపస్: వర్షం కురిస్తే రోడ్డుపై నీరు నిలిచిపోతోంది. రాకపోకల సమయంలో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. సోమవారం ఉదయం కురిసిన వర్షానికి బీచ్ రోడ్డులోని వీఎంఆర్‌డీఏ స్మార్ట్ సిటీ పార్క్ ఎదురుగా రోడ్డుపైన, కిర్లంపూడి లే అవుట్‌లోని పలు రహదారులపైన నీరు నిలిచిపోయి కనిపించింది. దీనిని తొలగించని పక్షంలో దోమలు వృద్ధి చెందే అవకాశముంది. పారిశుధ్య సిబ్బంది స్పందించి రోడ్లపై నిలిచిపోయిన వర్షపు నీటిని తొలగించే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

చిన్నారిని తల్లి చెంతకు చేర్చిన పోలీసులు



సాయికీర్తనను తల్లి రేవతికి అప్పగిస్తున్న టూటౌన్ సీఐ ఎర్రంనాయుడు, ఏఎస్ఐ కాంతం

అల్లిపురం: తప్పిపోయి రోడ్డుపై ఏడుస్తూ తిరుగుతున్న ఏడేళ్ల చిన్నారిని టూటౌన్ పోలీసులు తల్లి చెంతకు చేర్చారు. టూటౌన్ సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు తెలిపిన వివరాల ప్రకారం రాగోలు సాయి కీర్తన అనే ఏడేళ్ల చిన్నారి సోమవారం ఉదయం 11 గంటల సమయంలో పాత జైలురోడ్డు దరి గొల్లలపాలెం వద్ద రోడ్డుపై ఏడుస్తూ తిరుగుతోంది. అదే సమయంలో టూటౌన్ బ్లూకోట్స్ కానిస్టేబుల్ శివ చూసి అమ్మాయి నుంచి వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించాడు. ఆమె తన ఊరు కొత్తపల్లి అని చెప్పింది కానీ తల్లిపేరు, ఇంటి అడ్రస్ చెప్పలేకపోయింది. దీంతో టూటౌన్ సీఐ ఎర్రంనాయుడు సలహా మేరకు వాట్సప్ గ్రూప్‌లో వైరల్ చేశారు. అమ్మాయి తల్లి రాగోలు రేవతి తన భర్తను ఏడేళ్లుగా విడిపోయి కుమార్తె, తల్లితో కలిసి రామా టాకీస్ వద్ద వినాయకనగర్‌లో నివసిస్తూ ఒక హాస్టల్లో వంట మనిషిగా పని చేస్తోంది. సోమవారం ఉదయం ఎవరో చనిపోతే అక్కడికి తన తల్లితో కలిసి వెళ్లింది. సాయి కీర్తన ఒక్కతే ఇంట్లో ఉంది. ఎవరూ కనపడకపోవటంతో సాయి కీర్తన ఏడ్చుకుంటూ బయటికి వచ్చింది. వారింటి దగ్గర ఎవరో ఒక బొమ్మ ఉంటే అక్కడికి వెళ్లింది. వారు దెబ్బలాడటంతో రామా టాకీస్ నుంచి గొల్లలపాలెం చేరుకుంది. ఇంటికి వచ్చిన పాప తల్లి రేవతికి కుమార్తె కనిపించక పోవటంతో ఏడుస్తూ వెదకడం మొదలుపెట్టింది. త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లింది. ఇంతలో ఎవరో వాట్సప్‌లో ట్రెండ్ అవుతున్న ఫొటోలను ఆమెకు చూపించటంతో తన కుమార్తెగా గుర్తించింది. దీంతో టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుంది. పాప తల్లిని గుర్తించడంతో సీఐ ఎర్రంనాయుడు పాపను తల్లికి అప్పగించారు. తన కుమార్తెను సంరక్షించినందుకు ధన్యవాదాలు రేవతి పోలీసులకు ధన్యవాదాలు తెలిపింది.